

నూతన జాయింట్ కలెక్టర్‌గా భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎన్.తేజ్ భరత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కె.మాధవీలతను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాధవీలత జెసికి అభినందనలు తెలిపారు. జిల్లా కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో పరిపాలన, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉందన్నారు. జెసి భరత్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై దృష్టి సారిస్తారన్నారు. జెసికి అభినందనలు తెలిపిన వరిలో డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒలు చైత్ర వర్షిణి, ఎస్.మల్లిబాబు, డిఎస్ఒ పి.ప్రసాదరావు, కలెక్టరేట్ ఎఒ జి.భీమారావు, డిఎం (సిఎస్) ఆర్.తనూజ ఉన్నారు.

నేలంటిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూరగాయల ధరలు నేలను తాకాయి. కార్తీక మాసం నేపథ్యంలో గత నెల ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ తాజా పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. దీంతో రైతులు కుదేలవుతున్నారు. కూరగాయల సాగు కోసం రూ.లక్షలాదిగా పెట్టుబడి పెట్టినా ఆశించిన దిగుబడి రాక చివరికి కన్నీరే మిగులుతోంది. పొలంలో సాగు మొదలు పెట్టిన నాటి నుంచి పంట చేతికంది గిట్టుబాటు ధర పలికే పైసలు వచ్చే వరకు రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు గిట్టుబాటు ధరలు లేక ఏదో రకంగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. అయినా నమ్ముకున్న వ్యవసాయాన్ని వదలకుండా కష్టాలను, నష్టాలను దిగమింగుకుని పంటలను సాగు చేస్తూనే ఉన్నారు. మరోపక్క గ్రామాల్లో కోతుల బెడదతో వేసిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వంద్లాదితోటలతో పాటు కూరగాయల సాగు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు, వరదల కారణంగా పంట చేల్లో నీరు నిలిచి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపించింది. తాజాగా ధరలు పలకకపోవడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళన వెంటాడుతోంది.

కూరగాయల సాగు వైపు మొగ్గు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 32,500 ఎకరాల్లో కూరగాయల సాగు చేశారు. రబీ సీజన్‌లో 75 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. ప్రస్తుతం రబీ సాగు ప్రారంభ దశలో ఉంది. రంగంపేట, సీతానగరం, కోరుకొండ, పెరవలి, ఉండ్రాజవరం తదితర మొత్తం 10 మండలాల్లో కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు చేసేందుకు అన్నదాతలకు అవగాహన కరువవుతోంది. సాగు అనుభవంతోనే అక్కడక్కడా సాగు చేస్తున్నప్పటికీ జిల్లాలో డిమాండ్‌కు సరిపడా కూరగాయల సాగు కావడం లేదని తెలుస్తోంది. దీంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. సాగుకు ప్రణాళికలు రూపొందించి వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచాల్సినప్పటికీ అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రైతులకు విత్తనాల ఎంపికలో అవగాహన లేకపోవడంతో దిగుబడులు తగ్గి నష్టాల పాలు కావాల్సి వస్తోందంటున్నారు. కొన్నిసార్లు చీడపీడలు ఆశించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమాంతం పడిపోయిన ధరలు..

గత నెలలో ఉన్న కూరగాయల ధరతో పోల్చుకుంటే సగానికి సగం ధరలు పడిపోవడంతో కూరగాయల పంటలను సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అగస్టులో గోదావరి వరదల కారణంగా కూరగాయల సాగు 1,172 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో రెట్టింపు విస్తీర్ణంలో పంట నష్టం జరిగినా, దిగుబడి తగ్గిపోవటం వంటి పరిస్థితులు తలెత్తాయి. దీంతో కార్తీక మాసంలో డిమాండ్ ఏర్పడి ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం కిలో టమోటాలు రూ.20, వంకాయలు రూ.20, దొండ రూ.20 చొప్పున ధరలు పడిపోయాయి. చిక్కుళ్లు, బీన్స్, క్యారెట్ మినహా మిగిలిన రకాల బహిరంగ మార్కెట్లో రూ.50 మించి ధరలు లేవు. ఈ నేపథ్యంలో వ్యాపారులు ధరలు తగ్గించేశారు. పొద్దంతా కష్టపడి బస్తాల్లో నింపి కూరగాయలను వాహనాల్లో విక్రయానికి తీసుకువస్తే ధరలే లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కూరగాయల సాగు ఒక్కో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయని చెబుతున్నారు. కూరగాయ పంటలు సాగు చేస్తే ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసిపి సైకోలను భూస్థాపితం చేస్తా..

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

ప్రజాశక్తి- నిడదవోలు, రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇదే తనకు చివరి ఎన్నికలు అని కొంత మంది వైసిపి సైకోలు చెబుతున్నారని, అటువంటి సైకోలందర్నీ భూస్థాపితం చేసే వరకూ రాజకీయాల్లో కొనసాగుతానని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు మండలాల్లో రోడ్‌షో నిర్వహించారు. నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఒక పక్క పరిశ్రమలు తరలిపోతుంటే యువతకు ఉద్యోగాలు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. అమర్‌రాజా కంపెనీ తెలంగాణాలో పెట్టుబడులు పెట్టేందుకు తరలిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్‌ఆర్ ఆ కంపెనీకు భూములు ఇస్తే నేడు జగన్ దాన్ని రాష్ట్రం నుంచి తరిమేస్తున్నారని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో చాలా మందిని చూశాను...కానీ ఇంత నీచమైన సిఎంను ఎక్కడా చూడలేదన్నారు. సంక్షేమానికి, అభివద్ధికి టిడిపి పెద్ద పీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. వివేకా హత్యకేసులో సునితారెడ్డి పోరాటంతో కేసును తెలంగాణాకు బదిలీ చేశారన్నారు. అందుకే ఇదేం ఖర్మ రాష్ట్రానికి అని అంటున్నానని తెలిపారు. రాష్ట్రానికి శనిలా పట్టిన జగన్‌ను వదిలించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచుల పరిస్థితి మరీ దయణీయంగా ఉందన్నారు. వారే చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఉద్యోగులను నానా ఇబ్బందులకు గురిచేశాడన్నారు. తనపైనా అక్రమ కేసులు పెట్టేందుకు యత్నించారన్నారు. తన హయాంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బిజినెస్‌కు పెద్ద పీట వేశానని తెలిపారు. మాజీ మంత్రి పి.నారాయణ మామూలు వ్యక్తిగా పుట్టి నారాయణ గ్రూప్స్‌ను స్థాపించారని తెలిపారు. భారత దేశం మొత్తం విస్తరించి సామాన్యులకు సైతం విద్యనందిస్తున్నారు. ఆయన టిడిపిలో పనిచేశారనే అక్కసుతో నానా కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పోలవరం తాను నాటిన మొక్క అని, అది తన ప్రాణం అని వివరించారు. అటువంటి పోలవరాన్ని ఉన్మాద ముఖ్యమంత్రి గోదాట్లో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు టిడిపి కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నేత కుందుల వీరవెంకటసత్యనారాయణకు టికెట్ ఇప్పించాలని కార్యకర్తలు కేకలు వేయటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి క్రమ శిక్షణ గల్గిన పార్టీ అని గుర్తు చేశారు. 'అరవొద్దు తమ్ముళ్లు' అంటూ వేదికపై నుంచే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిని ఎక్కడ ఉంచాలో తనకు తెలుసునన్నారు. అభ్యర్థి ఎంపిక విషయంలో కార్యకర్తల అభిప్రాయం, అవసరమైతే ప్రజాభిప్రాయం తీసుకుని సమర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రులు జవహర్, పీతల సుజాత, ప్రత్తిపాటి పుల్లారావు, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, టిడిపి నిడదవోలు పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, సాయిబాబ తదితరులు ఉన్నారు. తొలుత ఆయన కొవ్వూరులో మహిళలో ముఖాముఖి మాట్లాడారు. మహిళలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. డ్వాక్రా మహిళలను సిఎం సభలను విజయవంతం చేసేందుకు మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. తన హయాలో రూ.5లక్షల కోట్లను రుణమాఫీ చేసినట్టు గుర్తు చేశారు. వైసిపి హయాంలో ఏ మేరకు భరోసా లభించిందో బేరీజు వేసుకోవాలన్నారు. అనంతరం చాగల్లు మండలం గౌరుపల్లి మీదగా దారవరం వరకు రోడ్ షో నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున హారతులు పట్టారు. కార్యకర్తలు, నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి సర్పంచ్ కోడూరు లక్ష్మీ సుభాషిణి ఆధ్వర్యంలో పూల మల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు తోట సీతామాలక్ష్మి, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎలు వీరాంజనేయులు, ఘంటా మురళి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌సి షేక్ షరీఫ్ జొన్నలగూడ చౌదరి, కె.రామకృష్ణ, ఆళ్ల హరిబాబు నాదల శ్రీరామ్ చౌదరి పాల్గొన్నారు.

నిడదవోలులో నిర్వహించిన బహిరంగ సభలో బాబు అభివాదం

'అన్ని వర్గాలనూ ముంచిన చంద్రబాబు'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

చంద్రబాబు నాయుడు 15 ఏళ్లుఈ రాష్ట్రాన్ని ఒక నియంతలా పాలించి అన్ని వర్గాలనూ నట్టేట ముంచేసిన ఘనుడని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి అధికారంలోకి రావడానికి బిసిలు, ఎస్‌సిలే ప్రధాన కారణమని అనేకసార్లు చంద్రబాబే చెప్పుకున్నారని, బిసిలు వెన్నెముక అని పదేపదే చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక వారి నడ్డి విరిచారన్నారు. ఎన్నికల చివర్లో ఓట్ల కోసం పెన్షన్ పెంచినందుకే ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. అయినా ఇంకా ప్రజలను వంచించే గుణం పోలేదన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు బిసి, ఎస్‌సిలకు 110 హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక కేవలం పది పన్నెండు హామీలను అమలు చేసి ప్రధానమైన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారన్నారు. తమ నేత, ముఖ్యమంత్రి జగన్ ఏవైతే ఎన్నికల ముందు హామీలిచ్చారో వాటిని గత మూడున్నరేళ్లలో 98 శాతానికి పైగా నెరవేర్చి సమర్థుడైన నేతగా ప్రజల్లో నిలిచారన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రుడా ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిళరెడ్డి, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీలు

చంద్రబాబు చాగల్లు రాకపోవడంతో నిరాశ

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు వస్తే ఓడిపోతామనే సెంటిమెంట్‌తో టిడిపి అధినేత చంద్రబాబు చాగల్లు రాకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిరసన తెలుపుతున్నారు. 2013లో కూడా చంద్రబాబు నిడదవోలు నియోజవర్గం మద్దూరు గ్రామం నుంచి చంద్రవరం వచ్చి కొవ్వూరు నియోజకవర్గం పసివేదల మీదుగా వెళ్లిపోయారని గుర్తు చేస్తున్నారు. గతంలో మాజీ ఎంఎల్‌ఎ సాలి వెంకట్రావు టిడిపి అభ్యర్థిగా నిలబడినప్పుడు ఆయనకు మద్దతుగా చంద్రబాబు చాగల్లు మండలం పర్యటించారు. ఆయన ఓడిపోవడంతో చాగల్లు వస్తే పార్టీ ఓడిపోతారని నాయకులు చెప్పిన మాటలతో ఆయన చాగల్లు రాకపోవడం బాధాకరమని తెలిపారు.

సమస్యలు సత్వర పరిష్కారం : మంత్రి వనిత

ప్రజాశక్తి-చాగల్లు

ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అక్కడకక్కడే పరిష్కరిస్తున్నామని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. మండలం ఊనగట్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మంత్రి వనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్నారు. రాష్ట్రంలో అర్హులైన పింఛను లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటి ముంగిటకే పింఛన్లు పంపిస్తున్నామని, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పాఠశాల పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని చెప్పారు. మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పెడుతునన్న భోజనాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పుష్టికరమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మెన్, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాసరావు, ఎంపిపి మట్టా వీరాస్వామి, ఆతుకూరి దొరయ్య పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

3, 4 తేదీల్లో ఓటు నమోదు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 3, 4 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం రోజుల్లో బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలు వరకు, ప్రజల వద్ద క్లెయిములు స్వీకరిస్తారని, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు నమోదు, ఓటు తొలగింపు/మార్పు, ఓటర్లందరు తమ ఆధార్ డేటాను ఎన్నికల డేటాతో లింక్ చేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులకు క్లెయిములు సమర్పించాలని సూచించారు.

నేడు సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గోపాలపురం

నూతన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను శనివారం ఎంఎల్ఎ వెంకట్రావు ప్రారంభించనున్నట్లు ఉదయం జరుగుతున్నట్లు వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మణమ్మ తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నిర్మాణాలను ఎంఎల్ఎ ప్రారంభిస్తారని తెలిపారు.

3న తాళ్లపూడి మండల సమావేశం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం మూడో తేదీ శనివారం జరుగుతుందని ఎంపిడిఒ ఎం.రాజశేఖర్ తెలిపారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని ఎంపిడిఒ అన్నారు.

ఖండవల్లిలో పంట కోత ప్రయోగం

పెరవలి : ఖండవల్లిలో శుక్రవారం పేకేరు-కోడవెల్లిపుంత రోడ్డు ప్రాంతంలోని రైతు గోపిరెడ్డి సూరిపండు వరి క్షేత్రంలో వరి వ్యవసాయం శాఖ ఎడి ఎ.శ్రీరామారావు పర్యవేక్షణలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి టి.వెంకటేశ్వరరావు, విఆర్ఒ వైవి.సుబ్బారావు, హార్టికల్చర్ అసిస్టెంట్ పి.కమల్ పాల్గొన్నారు.

సాయిబాబాకు ఘంటసాల పురస్కారం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని వీరవరం గ్రామానికి చెందిన నర్సరీ అధినేత, గాయకుడు ఆదిమూలం సాయిబాబా నిబద్ధతతో చేస్తున్న కళ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవలకు గుర్తింపుగా ఘంటసాల స్మారక ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా రాజమహేంద్ర వరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) ఆధ్వర్యంలో నిర్వహించు 'స్వరయజ్ఞం' కార్యక్రమంలో భాగంగా సాయిబాబా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

7న విజయవాడలో బిసి మహాసభ

గోకవరం : ఈనెల 7న విజయవాడలో నిర్వహించే బిసి మహాసభను విజయవంతం చేయాలని ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. ఈ మహాసభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరవుతున్నారని, నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని అత్యంత పారదర్శకంగా కొనుగోలు చేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, గృహనిర్మాణాలు, ఇంటింటికీ వైద్య సేవలు వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. తొలుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాధ్యతలు చేపట్టిన జవహర్ రెడ్డికి జిల్లా ప్రజల తరపున కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి నిర్వహించిన విసిలో కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో పండించిన ధాన్యానికి సంబంధించి 75 శాతం కోతలు పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 4.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసినట్టు తెలిపారు. దీనిలో అందులో 2.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 239 ఆర్‌బికెల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తురన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే తొలి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లాలోని అనపర్తి మండలంలో నవంబర్‌లో ప్రారంభించినట్లు చెప్పారు. నూతన మార్గదర్శకాల మేరకు తొలి రోజుల్లో ఎదుర్కొన్న ఒడదుడుకులను అధిగమించినట్టు చెప్పారు. జిల్లాలో 76 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా 36 లక్షల బ్యాగ్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటిని రొటేషన్ పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ఎటువంటి సమస్యలూ లేవని, జిల్లాలో కోరుకొండ, గోకవరం, సీతానగరం మెట్ట ప్రాంతాల్లో కోతలు పూర్తయినట్టు మాధవీలత తెలిపారు. ఈ క్రాప్ నమోదు విషయంలో పారదర్శకంగా చేపడుతున్నట్టు తెలిపారు. ప్రాధాన్యత భవనాలకు సంబంధించి ఎప్పటికప్పుడు, వాటికి సంబందించిన పనుల బిల్లులను అప్లోడ్ చేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్క కుటుంబానికీ వైద్య సేవలు అందించే క్రమంలో ఫ్యామిలీ కాన్సెప్ట్ కింద వైద్య సేవలు అందించడానికి, ఆయా ఇళ్లను మ్యాపింగ్ చేపట్టడం, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాలు నిర్మాణం పూర్తి చెయ్యడంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్టు మాధవీలత తెలిపారు. నాడు నేడు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పురోగతిని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జి.నరసింహులు, డిపిఒ జగదాంబ, డిఇఒ ఎస్.అబ్రహాం, డిహెచ్ఒ బి.తారాచంద్, సిపిఒ కె.ప్రకాష్ పాల్గొన్నారు.

మోర్తలో డెంగీ నివారణ చర్యలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త గ్రామం, కొత్త కాలనీలో డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టినట్టు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసును శుక్రవారం నమోదు చేసినట్టు చెప్పారు. ఆయన సూచనల ప్రకారం, పిహెచ్‌సి హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో, తణుకు సెక్టార్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు గ్రామ ఆరోగ్య, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టారు. 5 పారామెడికల్ టీములతో ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వర లక్షణాలు గల ఒక వ్యక్తిని గుర్తించి మందులు అందజేశారు. సచివాలయ కార్యదర్శి రామ్‌ప్రసాద్ డ్రెయిన్లలో సిల్ట్ తీయించి, యాంటీ లార్వాల్ ఆయిల్ చల్లించారు.

భూహక్కు రక్షణ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి-కడియం

దామిరెడ్డిపల్లిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు రక్షణ పత్రాలను వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన అత్యాధునిక సర్వే సాంకేతిక పరికరాలు ఉపయోగించి, రెవెన్యూ మరియు సచివాలయ సిబ్బంది రీ-సర్వే చేపట్టినట్టు చెప్పారు. సమగ్రంగా భూ-వివరాలు తెలిపే భూ-కమతం పటం, ఇక మీదట గ్రామాల్లోనే అందుబాటులో ఉంటుందన్నారు. దీని కారణంగా ఎటువంటి పొరపాట్లు, వివాదాలకు తావులేకుండా రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

కార్టూ'నిజం'



అక్రమంగా సంపాదించిన కేసు నుంచి ఎలా బయట పడ్డానంటావా? అక్రమ సంపాదన డబ్బునుపయోగించి..!!

వినియోగదారుల రక్షణ పటిష్టతకు చర్యలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో వినియోగదారుల రక్షణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు, సభ్యులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వినియోగదారుల రక్షణ మండలి మొదటి సమావేశం కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన జిల్లాగా ఏర్పాటు తరువాత తొలిసారి నిర్వహిస్తున్న ఈ సమావేశంలో వినియోగదారులకు అందుతున్న సేవల విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై నివేదిక రూపొందించి, తదుపరి సమావేశంలో వాటి పరిష్కారం చూపే ప్రయత్నం చేద్దామన్నారు. జెసి ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ, ఫలవంతమైన విధానంలో చర్చలు జరపాల్సి ఉందన్నారు. తదుపరి సమావేశంలో ప్రధాన సమస్యలు తీసుకుని వచ్చి చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, డిఎస్ఒ పి.ప్రసాద రావు, వినియోగదారుల ఫోరం సభ్యులు గొట్టుముక్కల అనంత్ రామ్, మధు, సుంకర వీరశేఖర్ పాల్గొన్నారు.

గోపాలపురం టిడిపి అభ్యర్థిగా మద్దిపాటి

ప్రజాశక్తి -దేవరపల్లి

గోపాలపురం నియోజకవర్గం టిడిపిలో ఉన్న గందరగోళాన్ని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు క్లియర్ చేశారు. గోపాలపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిపై స్పష్టత ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన నియోజకవర్గంలోని దొండపూడి గ్రామానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా భారీగా టిడిపి శ్రేణులు తరలి వచ్చాయి. బాబుతో పాటు ఒకవైపు మద్దిపాటి వెంకట రాజు, మరోవైపు మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఉన్నారు. ఇక ఇప్పటికే ముప్పిడిని తప్పించి గోపాలపురం పార్టీ ఇన్‌ఛార్జి బాధ్యతలను మద్దిపాటికి అప్పగించారు. ఇప్పుడు గోపాలపురం వచ్చిన సందర్భంగా బాబు మద్దిపాటిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. గోపాలపురం నియోజవర్గం నుంచి మద్దిపాటి వెంకట రాజుకు బాధ్యతలు అప్పగించామని, మాజీ ఎంఎల్ఎ వెంకటేశ్వర రావుకు మరిన్ని మంచి అవకాశాలు భవిష్యత్తులో కల్పిస్తామని ప్రకటించడం విశేషం.

ఆర్‌బికెల్లో సమస్యలపై రైతుల నిరసన

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో ఆర్‌బికెల వల్ల తాము అవస్థలు పడుతున్నామని రైతులు ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పాల్గొని స్థానిక తహశీల్దార్ దివ్యభారతికి రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆర్‌బికె వ్యవస్థ అంతా లోబా భూయిష్టంగా ఉందని, రైతులకు ఒకటి చెబితే, మిల్లర్ల దగ్గరికి వెళ్ళినప్పుడు మరోలా చెపుతున్నారని తెలిపారు. దీని వల్ల రైతులు నానా ఇబ్బందులూ పడుతున్నారని చెప్పారు. రైతులకు రూ.1,530 మద్దతు ధర ఇస్తున్నామని గొప్పలకే తప్ప, తేమశాతం వ్యత్యాసం హమాలీల కొరత, రవాణా భారం మోపడం వల్ల రైతు భారీగా నష్టపోతున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగరౌతు రామకృష్ణ, ఉంగరాల రాము, చింతల రామకృష్ణ, పాలూరి బోసుబాబు, గుడిపే భరత్ పాల్గొన్నారు.

హెబ్రోన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం హెబ్రోన్ ప్రార్థనా మందిరంలో యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు కొడమంచిలి ప్రకాష్ బాబు అధ్యక్షతన శుక్రవారం క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ ఈ క్రిస్మస్ వేడుకలు జనరల్ సెక్రటరీ రెవరెండ్ జోషియా రాజు నిర్వహించారన్నారు. మండలంలో ఉన్న క్రైస్తవ సోదరులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాస్టర్ ఎం.ఇమ్మానుయేలు, గ్రామ సర్పంచ్ ఇండిగమెల్లి చంద్రలీల పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. యువత క్రిస్మస్ గీతాలను ఆలపించారు. అనంతరం కొవ్వొత్తులను చేత పట్టి ప్రదర్శన నిర్వహించారు. స్టార్ వెలిగించారు. పురవీధుల గుండా ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వై.రూబిన్ జాషువ, కె.జాన్ బాబురావు, డి.జోసఫ్ రాజు, బి.శేఖర్‌బాబు, చిలకపాటి వెంకటేశులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో అరుదైన పాము

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెంలో పోతవరం రోడ్డు కాలువ గట్టుపై రెండు తలల పాము కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ పాముపై పలు అపోహలు ఉన్నాయి. విషం లేని బోయ్‌డే కుటుంబానికి చెందిన ఈ పామును రెడ్ సాండ్ బోవాగా పిలుస్తారు. రెండు తలల పాముగా పిలిచే ఈ రకపు పాముల తోక చివరి భాగం గుండ్రంగా ఉండి తలను పోలి ఉండటం వల్ల రెండు తలలు ఉన్నట్టు అనిపిస్తుంది. ఈ పామును పట్టుకోవడం చంపటం అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరం.

డ్రెయినేజీ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఖండవల్లి పంచాయతీ పరిధిలో డ్రెనేజీ నిర్మాణ స్థలాన్ని ఎంపిపి కార్చెర్ల సీతారామప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. డ్రెనేజీ నిర్మాణ చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసినట్టు ఎంపిపి తెలిపారు. సర్పంచ్ పి.నాగరాజు ఎంపిడిఒ ఎస్.రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్.సూర్యనారాయణ రాజు, మండల ఇంజనీరింగ్ అధికారి కెఎస్.రామచంద్ర రెడ్డి, ఇరిగేషన్ ఎఇ ఎ.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఎ.వేణు గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి ఎ.లక్ష్మీ నారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, సెక్రెటరీ టి.అనురాధ ఎంపిటిసి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోధనేతర పనులన్నీ తప్పించాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

విద్యా బోధనకు దగ్గర చేసే క్రమంలో ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒను స్వాగతిస్తున్నామని, ప్రజలతో సంబంధం ఉన్న పనులను మాత్రమే తప్పించడం సరికాదని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలు పదేళ్లకు ఒకసారి జరిగే జన గణన విధుల నుండి ఉపాధ్యాయులను తప్పించిన ప్రభుత్వం బోధనకు అడ్డంకిగా ఉన్న అనేక రకాల యాప్‌లు, నాడు నేడు పనుల పరిశీలన తొలగించాలన్నారు.

8న ఎపిఎన్‌జిఒ అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒ అధ్యక్ష పదవికి ఈ నెల 8వ తేదీన నామినేషన్లను స్వీకరించనున్నామని ఎన్నికల అధికారి, యూనియన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు బండి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 8వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 24న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒల సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా ఉన్న గుడాటి రామ్మోహనరావు బాధ్యతలు నవంబర్‌తో పూర్తయిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నామని తెలిపారు.

లారీ ఢీకొనడంతో యువకుని మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం, సురంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ వెనుక ఉన్న క్వారీ వద్ద టిప్పర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు టిప్పర్ డ్రైవర్ లోడింగ్ నిమిత్తం లారీని బ్యాక్ చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రొక్లెయిన్ డ్రైవర్ సర్వాన్‌కుమార్‌ను ఢీకొన్నాడు. దీంతో సర్వాన్‌కుమార్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జార్ఖండ్ వాసి అని స్థానికులు తెలిపారు. సురంపాలెం వీఆర్‌ఒ బొద్దిరెడ్డి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థానిక మండలంలోని ఎన్‌టిఆర్ బీచ్‌లోని సముద్రతీరంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు తిమ్మాపురం ఎస్ఐ కె.నాగార్జునరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు..మరణించిన వ్యక్తికి 60 నుంచి 65 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. శరీరంపై తెల్ల చొక్కా, షార్టు ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో లేదా 9440796556 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -మండపేట

మారేడుబాక రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.56వేలతో ఎనిమిది కుట్టు మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. గార్మెంట్ టెక్నాలజీలో భాగంగా ఈ కోర్సును ప్రాంభించామని తెలిపారు. దీనికోసం కళాశాల సమయం కంటే ఒక గంట ముందే అధ్యాపకులు వస్తున్నందుకు వారికి కతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో గల అన్ని సచివాలయాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు స్థానిక ఎంపిడిఒ కె.జాన్‌లింకన్, ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో సచివాలయ సిబ్బందిలో జవాబుదారీతనం ఉంటుందన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందించే సేవలు ప్రత్యక్షంగా చూడగలుగుతామన్నారు. మండల సమావేశంలో సిసి కెమెరాల ఏర్పాటుపై చర్చించి తగు చర్యలు చేపడతామని ఎంపిడిఒ సర్పంచ్‌కు హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట కార్యదర్శి డి.సుబ్బారావు ఉన్నారు.

అభివృద్ధి పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - ఆలమూరు

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కషి చేయాలని ఎంపిడిఒ జాన్ లింకన్ ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో గృహ నిర్మాణాలు వేగంగా నిర్మించేందుకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలఖరుకు అన్ని గహ నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫైలెట్ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న అన్ని గహ నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలన్నారు. అలాగే మండలంలో వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కషి చేయాలన్నారు. భవన నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయో అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఇంటి పన్నుల బకాయిలపై కార్యదర్శులతో చర్చించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నూరుశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ డి.శ్రీనివాసు, ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పోసమ్మ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రేమ పేరుతో మోసగించాడంటూ యువతి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. శుక్రవారం బాధితురాలు విలేకర్లతో మాట్లాడారు. భర్త లేకపోవడంతో బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో పినచేస్తున్నానని తెలిపింది. తన కుమార్తెను నీలపల్లిలోని తన సోదరి ఇంటి వద్ద ఉంచానిని తెలిపారు. స్థానిక హైస్కూల్లో పదో తరగతి చదువుకుంటుందని తెలిపింది. కొద్ది రోజులుగా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ మూలపొలానికి చెందిన తిరుకోటి ఆనంద్ అనే యువకుడు తన కుమార్తెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడని తెలిపింది. ఈనెల 30న తన కుమార్తెను ఇంటి నుంచి తీసుకెళ్లాడని తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం తెల్లవారుజామున తీసుకొచ్చాడని పేర్కొంది. తమ కుమార్తెను వివాహం చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని వాపోయింది. తమకు న్యాయం చేయాలని పేర్కొంది.

యానాంలో చోరీలను అరికట్టాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో చోరీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొత్త బస్టాండ్ వద్ద పార్కు చేసిన సైకిల్లు, మోటార్ సైకిల్ చోరీకు గురవుతున్నాయని తెలిపారు. తాళ్లరేవు, కాకినాడ, అమలాపురం కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే చిరు ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు బస్టాండ్ ప్రాంతంలో వాహనాలను పార్క్ చేస్తున్నారు. తమ పనులు ముగించుకుని తిరిగి వచ్చేసరికి పార్క్ చేసిన వాహనాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తాళం వేసినప్పటికీ వాహనాలు మాయమవుతున్నాయని వాపోతున్నారు. శుక్రవారం రెండు సైకిళ్లు ఇక్కడ అపహరణకు గురయ్యాయి. రాత్రుల సమయంలో ఫోన్లు సైతం లాక్కును వెళ్లిపోతున్నారని వాపోయారు. బస్టాండ్ ఆవరణలో సిసి కెమెరా లేకపోవడంతో చోరులను కూడా గుర్తించలేకపోతున్నారన్నారు. చోరీలను అరికట్టడంతో పోలీసులు విఫలమయ్యారని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ విమర్శించారు. ఇప్పటికైనా యానాం ప్రభుత్వ అధికారులు, పాలకులు స్పందించి చోరీలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యతో అసమానతలు తొలగింపు

కాకినాడరూరల్ : విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగుతాయని, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్ వెంకట్రావు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్ష సంఘం ఆధ్వర్యంలో మహిళల వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నెల 25 నుంచి ఈ నెల 10 వరకు మహిళలు వేధింపుల నివారణ అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పని ప్రదేశాల్లో కళాశాలలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా యజమాన్యాలపై ఉందని అన్నారు. మహిళలను ఎవరైనా వేధిస్తే సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ధైర్యంగా ఫిర్యాదు చేయాలని వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫార్మా - డి గ్రాడ్యుయేషన్ డే

గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కళాశాలల ఫార్మా -డి (2016-22) కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. సదస్సుకు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించగా రాజమహేంద్రవరం జిఎస్ఎల్ వైద్య కళాశాలకు చెందిన డాక్ట్ వై. అన్నపూర్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు 45 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో సిపిఎం నాయకులు రామారావు మృతి

పలువురి సంతాపం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు మండలం సోంపల్లికి చెందిన సిపిఎం నాయకులు, సిఐటియు సీనియర్ నాయకులు కందికట్ల రామారావు(65) సఖినేటిపల్లి మండలం మోరిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హఠాన్మరణం చెందారు. ఈనెల 7న తన కుమారుడు వివాహం జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం రామారావు తన భార్య గిరిజతో కలిసి బైక్‌పై అంతర్వేది బయలుదేరారు. మోరి నాలుగురోడ్ల కూడలిలో టాటా మ్యాజిక్ వ్యాన్ వీరి బైకును ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108లో వారిని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రామారావును అమలాపురం తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలోనే మృతి చెందారు. అతని భార్య గిరిజకు కాలు విరిగిపోవడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

రామారావు 1999 నుంచి సిపిఎం నాయకులుగా ఉన్నారు. సిఐటియులో సీనియర్ నేతగా కొనసాగుతున్నారు. రామారావు డ్రెయినేజీ, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నాయకునిగా, రాజోలు మండలం సిఐటియు కార్యదర్శిగా, విఆర్ఎల సంఘం జిల్లా నాయకునిగా పనిచేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, పేదల సమస్యలపై పలు పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన భార్య కందికట్ల గిరిజ ఐద్వా జిల్లా నాయకులుగా కొనసాగుతున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వివాహ సమయంలో ఇలాంటి సంఘటన జరగడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు

సిపిఎం నాయకుల సంతాపం

రామారావు మరణ వార్త తెలుసుకున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తీవ్ర సంతాపం తెలిపారు. రామారావు భౌతిక కాయాన్ని సందర్శించారు. సిపిఎం జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామారావు మరణం సిపిఎంకు తీరని లోటు అని అన్నారు. ప్రజల కోసం ఆయన నిరంతరం పోరాడే వారని గుర్తు చేసుకున్నారు. రామారావు మతిపై సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 23 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకులు కుడుపూడి రాఘవమ్మ, సఖినేటి సూర్యనారాయణ, పాము బాలయ్య, తాడి శ్రీరామమూర్తి, టి.నాగవరలక్ష్మి, బీర వెంకట్రావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

శనివారం రామారావు అంత్యక్రియలు

కందికట్ల రామారావు అంత్యక్రియలు రాజోలు పుష్కర ఘాట్‌లో శనివారం నిర్వహించనున్నట్లు సిపిఎం నాయకులు పీతల రామచంద్రరావు తెలిపారు. సిపిఎం కార్యకర్తలు, నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నాలన్నారు. 23 ఏళ్ల పాటు రామారావు తమతో కలిసి పనిచేశారని, ఆయన మరణం పార్టీకి తీరనిలోటు అని అన్నారు.

6 నుంచి జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా విద్యార్థుల్లో కళా నైపుణ్యాలు వెలికి తీసి ప్రోత్సహించే నిమిత్తం జిల్లా స్థాయి పోటీలు బొమ్మూరులోని డైట్ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి జిల్లా విద్యా శాఖాధికారి ఆర్‌జె.డేనియల్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పది అంశాల్లో జరుగుతాయన్నారు. 6న గాత్ర సంగీతం (క్లాసికల్ హిందుస్తానీ కర్ణాటక), గాత్ర సంగీతం(సంప్రదాయ జానపద), వాద్య పరికరాల సంగీతం, వాద్య పరికరాల సంగీతం(మెలోడీ), నత్యం(క్లాసికల్, జానపదం) అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 7న దశ్యకళలు (డ్రాయింగ్ లేదా పెయింటింగ్) దశ్యకళలు (త్రిమితీయ అనగా శిల్పం), సంప్రదాయ బొమ్మలు,. ఆటలు, డ్రామా (ఏకపాత్రాభినయం) పోటీలు ఉంటాయన్నారు. 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థులు పాల్గొనొచ్చన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఫోటోలు, రైట్ అప్స్ ఇతర ఆధారాలతో పాటు ప్రధానోపాధ్యాయుల లేదా ప్రిన్సిపల్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. ప్రతి అంశం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు కెవి.సూర్యనారాయణ(9949602721), కె.గంగాధర్‌రావు(9440339416)లను సంప్రదించాలని పేర్కొన్నారు.

450 మందికి వాటర్ బాటిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-కరప

గురజానపల్లి హైస్కూల్‌లో సంకల్పం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు శంకర్ ఆధ్వర్యంలో పాఠశాలలో స్టీల్ బాటిల్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం ప్రసాదరావు అధ్యక్షతన శుక్రవారం 450 మంది విద్యార్థులకు మిల్టన్ వాటర్ బాటిల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్యం కోసం పరిశుభ్రమైన నీరు ప్రతీ ఒక్కరూ తాగాలి అని సంకల్పం స్వచ్ఛంద సంస్థ స్థాపకుడు తెలిపారు. ముఖ్య అతిథిగా కాకినాడ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ జంక్ ఫుడ్ తినవద్దు అని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, స్వచ్ఛ గురజానపల్లి సంస్థాపకులు రాజు, వివి రమణ మూర్తి, సూర్య నారాయణ మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బోధనా ఆసుపత్రుల నిర్మాణ పనులను కలెక్టర డాక్టర్ కె.మాధవీలత శుక్రవారం పరిశీలించారు. 'మేక్ షిఫ్ట్ - పిఐబి' పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. పనులను మరింత వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రూ.475 కోట్లతో 150 మంది వైద్య విద్యార్థుల కోసం బోధనా వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్మాణం పనులను చేపడుతున్న దష్ట్యా ఆ ప్రాధాన్యత మేరకు పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, మేఘా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులతో పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కెఎస్.జవహర్‌రెడ్డి ద్వారా ఆసుపత్రుల నిర్మాణం, నాడు నేడు పనులపై సమీక్ష నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నామన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ బందం బోధనాసుపత్రి పనులను పరిశీలించేందుకు రానుందన్నారు. ఈ మేరకు పనులు పురోగతి సాధించాలన్నారు. భవన నిర్మాణ మ్యాప్‌ను , ప్రి- ఇంజినీరింగ్ భవనంలో ఇప్పటి వరకు జరిగిన పనులపై దశల వారీగా చేపడుతున్న వివరాలను అధికారులు వివరించారు. ముఖ్య ఆసుపత్రికి అనుసంధానంగా తదితర భవన నిర్మాణ పనులు కూడా చేపడుతున్నామని ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవ కోసం వచ్చిన వారితో కలెక్టర్ మాట్లాడారు. అక్కడ అందుతున్న సేవలు తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్ఎస్ఎస్ఐడిసి వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయభాస్కరరెడ్డి, ఎస్ఇ పి.అశోక్‌కుమార్, డిఇఇ ఎస్.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బ్యాంకు బృందం పర్యటన

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోట పిహెచ్‌సి పరిధిలోని రాయభూపాల పట్నంలో ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం హెచ్.హిమాన్షు ఆధ్వర్యంలో వరల్డ్ బ్యాంకు హెల్త్ బృందం పరిశీలించింది. ఈ కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంతాల రోగులకు 67 రకాల మందులు పంపిణీ చేయడమే కాకుండా 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పిహెచ్‌సి వైద్యాధికారి సిహెచ్.ధనలక్ష్మి తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో 11 గ్రామాల్లో ఈ కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వారి వెంట ఎంపిహెచ్ ఎస్.రామ్మోహన్, సిహెచ్ఒ ఊర్మిళాదేవి, రాజీవ్, సౌజన్య, ఎంపిహెచ్ ఎ.శ్రీనివాస్, భారతి, క్రాంతి, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఐడియల్ యూత్ స్టేట్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం కొత్త కాలనీ మస్జీద్ -ఈ-మసూదా-హబీబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐవైఎం ఆధ్వర్యంలో జనవరి 28, 29 న నిర్వహిస్తున్న ఐడియల్ యూత్ స్టేట్ కాన్ఫెరెన్స్ పోస్టర్, కరపత్రాలనున ఐవైఎం జిల్లా బాధ్యులు చాన్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవైఎం సాంఘిక సేవా సంస్థ అన్నారు. యువకుల్లో నైతికతను పెంపొందింపజేసి నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు చేయడానికి కషి చేస్తుందన్నారు. జనవరి 28 , 29 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర అధ్యక్షులు అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ యువకుల్లో సత్ప్రవర్తన, సమాజం పట్ల నైతిక బాధ్యత పెంపొందించడం ఈ సమావేశ లక్ష్యమన్నారు. రావులపాలెం పరిసర ప్రాంతాల యువకులందరూ ఈ సమావేశంలో ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ స్థానిక అధ్యక్షులు మహబూబ్ సుభానీ, ఐవైఎం కార్యదర్శి ఇమామ్ వలీ, సయ్యద్ వల్లిబాబు, రహీమ్, అబ్దుల్ షుకుర్, మీరామోహిద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - కాజులూరు

ఎరువుల యాజమాన్య పద్ధతులు ఆవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని కరప ఎడిఎ కె.బాబూరావు అన్నారు. శుక్రవారం జగన్నాథగిరిలో పొలంబడి కార్యక్రమం ఎఒ అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఎడిఎ పాల్గొని మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వాడరాదని రైతులకు సూచించారు. కలుపు మందులు కూడా సాధ్యమైనంత వరకు తక్కువగా వినియోగించాలన్నారు. అప్పుడే భూసారం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. తెగుళ్ల వచ్చినప్పుడు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి మాత్రమే పురుగుమందులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరాని గణేశ్వరరావు సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు రాజేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆదిత్యలో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ ప్రాంగణంలో కాకినాడ జెఎన్‌టియుకె పరిధిలోని అంతర్ కళాశాల అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2022-23 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిత్య క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జెఎన్‌టియు నరసాపురం పీడీ, ఇంటర్ కాలేజియేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జిపి.రాజు హాజరయ్యారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఆర్ఎంసి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్పర్జన్‌రాజ్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ టివి.ఎస్.రంగారావు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రెండురోజుల ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాల ని క్రీడాకారులకు సూచించారు. ఆదిత్యలో వరుసగా 8వ సారి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.మురళీ మోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన 550 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి విభాగం డీన్ జెడి.వెంకటేష్, పీడీలు పాల్గొన్నారు.

బ్యాంకుల్లోనే ప్రజాధనానికి భద్రత

కాకినాడరూరల్ : బ్యాంకుల్లోనే ప్రజల డబ్బులకు భద్రత ఉంటు,ంని కరూర్ వైశ్య బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.అరుణ అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నేడు చిన్న మధ్య తరహా పరిశ్రమలతో పాటు డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేస్తూ సామాన్యుని జీవితంలో బ్యాంకులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. తమ బ్యాంకులో సీనియర్ సిటిజన్స్‌కు అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. రూ.399 చెల్లిస్తే బీమా కవరేజ్ కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.రత్న ప్రసాద్, నాగలింగేశ్వరరెడ్డి, ఎస్.శ్రీనగేష్, రాజా పాల్గొన్నారు.

హోప్ ఐలాండ్ సమస్యలపై దృష్టి

తాళ్లరేవు : కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్ గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపిపి రాయుడు సునీత అన్నారు. ఎంపిపి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఈ ఐలాండ్‌లో పర్యటించారు. గ్రామస్తులు కోరిక మేరకు వాటర్ ప్లాంట్ మిషనరీ మరమ్మతు పనులు చేపట్టామన్నారు. రెండు బావులు తవ్వి వాటర్ ప్లాంట్‌కు తాగునీటి కనెక్షన్ ఇస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మారుతీరావు తెలిపారు. విద్యుత్ సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపిపి సునీత తెలిపారు. ఆమె వెంట స్థానిక ఉపసర్పంచ్ భైరవమూర్తి, ఎంపిటిసి సభ్యులు పోతుల రత్నకుమారి, వైసిపా నాయకులు కె.నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరుల ఉన్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - మామిడికుదురు, మండపేట, కాకినాడ కార్పొరేషన్

కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా అడుగులు వేయాలని దీప్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మామిడికుదురు డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో చెట్టు ఒక కిలో కలప తయారు చేయాలంటే మానవాళి విడుదల చేసే 1.47 కిలోల కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని మనకు అవసరమైన 1.07 కిలోల ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందన్నారు. ఆ లెక్కన చూసుకుంటే అయిదేళ్ల నుంచి కోల్పోతున్న ఆయా చెట్ల ద్వారా 10,808 మందికి జీవితాంతం సరిపడా ప్రాణవాయువు లభించేది. కాని నేడు ఆ సౌకర్యాన్ని కోల్పోయినట్టేనని ఆయన వివరించారు. ఒక మోటారు వాహనం 10,000 మైళ్ల దూరం ప్రయాణించి సష్టించిన కాలుష్యాన్నంతటినీ 15 చెట్లు పూర్తిగా పీల్చేసుకుంటాయన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని. ప్రకతిని కాపాడేందుకు ప్రయత్నం ప్రారంభించాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మోకా రంగారావు, కోడూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట : జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం చిట్టూరి వెంకటశ్రీధర్ విద్యార్థులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కాలుష్యం వల్లమానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలన్నారు.

కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

కాకినాడ కార్పొరేషన్ : జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కరణం గారి జంక్షన్ వద్ద ఉన్న ఎంఎస్ఎన్ పాఠశాల విద్యార్థులు పర్యావర ణాన్ని రక్షించాలని ఎంఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత ఎం.విజయకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురికి మొక్కలను అందించి ఇంటి వద్ద నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 227/2021
Between:
గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి -వాది
AND
ఓగిరెడ్డి సత్యనారాయణరెడ్డి -ప్రతివాది
To:
ఓగిరెడ్డి సత్యనారాయణరెడ్డి, S/o. వెంకటరెడ్డి, 59 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 7-235, పిల్ల కాలువ దగ్గర, అనపర్తి, అనపర్తి మండలం, అనపర్తి DMC. -ప్రతివాది
పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 30-12-2022** గా వాయిదా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
టి.వి.నారాయణరెడ్డి
వాది తరపు అడ్వకేట్
అనపర్తి, సెల్: 9849484239

In The Court Of The VIth Additional District and Sessions Judge : Kakinada
M.V.O.P.No. 135/2019
Between:
Pothu Appayamma and others ...Petitioner
AND
Pathi Sathibabu and others ...Respondent
TO:
Pathi Sathibabu, S/o. Bhimanna, Hindu, Age 39 Years, R/o. D.No. 3-36, Market Street, Polekurru Village, Tallarevu Mandal, Driver and Owner of Auto Bearing No. AP 05 TD 3709.
పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.13-12-2022వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీర వెంకట సత్యనారాయణ (అబ్బు)
Kakinada, Advocate, Kakinada.
02-12-22. Cell: 98482 52425

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.P. No. 128/2018
O.S. No. 1243/2005
Between:
K.Maheswara Mani Lal ...D.Hr
AND
Vinnakota Sivanand and Others ...J.Drs
J.Dr-2: Madipalli Satya Prasad, S/o. Purushottam, aged 61 years, D.No. 25-4-1, Jaya Krishnapuram, Rajahmundry, E.G.Dist.,
J.Dr-3: Dwarampudi Venkata Lakshmi, W/o. Dwarampudi Venkata Ramana Reddy, aged 50 years, D.No. 59-11-9/1, P and T Colony, Rajahmundry, E.G.dist.,
J.Dr-5: Kesavarapu BRahmanandam, S/o. K.Satyanarayana, aged about 37 years, D.No. 3-25, Munisif Street, Kolamuru.
పై నంబరు దావాలో 2, 3 5 జెడిఆర్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 15-12-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.శ్రీనివాస్
రాజమండ్రి అడ్వకేటు, రాజమండ్రి
29-11-2022 సెల్:9701332960

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో మండలంలోని జి.మేడపాడు-బిక్కవోలు రైల్వే స్టేషన్ల మధ్యలో శుక్రవారం గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేనంతగా ఛిద్రంగా ఉందని రైల్వే కీమెన్ బన్వర్‌లాల్ మీనా సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ బి.లోవరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు వుండి, చామనచాయ రంగులో ఉన్నాడని తెలిపారు. శరీరంపై నీలం రంగు షర్టు, సిమ్మెంటు రంగు ప్యాంటు ఉందన్నారు. మృతుని ముఖం చిద్రమై గుర్తుపట్టలేనివిధంగా ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

CHANGE OF NAME
My Old Name is KODURI DURGA PRASAD, S/o. KATRAPARTHI KRISHNA. My changed name is **KATRAPARTHI PRASAD,** S/o. KATRAPARTHI KRISHNA, D.No. 7-146, Balaji Theatre Road, Korukonda Village & Mandal, East Godavari District.
Cell: **73826 83934**

CHANGE OF NAME
I, Undersigned MANDA RAMA KRISHNA REDDI (Old Name), S/o. MANDA SURYANARAYANA REDDI, R/o. 76-5-44, Saikalyani Apartment, Gandhipuram-2, Danavaipeta, Rajahmundry - 533101. Changing my Name from **MANDA RAMAKRISHNA REDDI** (Old Name) to **MANDA RAMAKRISHNA REDDY,** S/o. Suryanarayana Reddy (New Name) hence froth I am being called as **MANDA RAMAKRISHNA REDDY** (New Name) for all purposes.

CHANGE OF NAME
I, Undersigned MANDA LAKSHMI (Old Name), W/o. M.Ramakrishna Reddy, R/o. 76-5-44, Saikalyani Apartment, Gandhipuram-2, Danavaipeta, Rajahmundry-533101. Changing my Name from **MANDA LAKSHMI** (Old Name) to **MANDA VENKATA LAKSHMI** (New Name) hence froth I am being called as **MANDA VENKATA LAKSHMI** (New Name) for all purposes.

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 42/2022
బిట్వీన్:
బొంతు సత్తిరాజు, తండ్రి: పల్లయ్యశెట్టి, వయస్సు 52 సం॥లు, హిందూ, వ్యవసాయం, పేరూరు, అమలాపురం మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. ...వాది
అండ్
పెన్మెత్స వంశీ కృష్ణరాజు, తండ్రి: లేటు రామకృష్ణరాజు, వయస్సు 24 సం॥లు, హిందూ, మెడికల్ స్టూడెంట్, డో.నెం. 5-3-75, సుబ్బారాయుడి గుడి వద్ద, కాలేజీ రోడ్డు, అమలాపురం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. ...ప్రతివాది
పై నెంబరులోని వాది పేరున మీ తండ్రి పెన్మెత్స రామకృష్ణరాజు గారు వ్రాయించి ఇచ్చిన ప్రాంశరీ నోటు బాకీ మొత్తమునకు వారు మరణించినందున, వారి వారసులైన మీ పై డిక్రీ ఇప్పించమని కోరుచూ వాది దావాను దాఖలు చేసినారు. అందుపై శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసిననూ అమలు జరగనందున మీకు ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని ఉన్న ఎడల శ్రీకోర్టు వారి ఎదుట వాయిదా తేదీ అయిన **ది.08-12-2022వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తెలియపర్చుకొనవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
అమలాపురం, **తిక్కా వెంకటప్రసాదరావు,**
30-11-22. వాది తరపు అడ్వకేట్,
అమలాపురం. సెల్: 94400 63075

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 673/2022
O.S.No. 42/2022
బిట్వీన్:
బొంతు సత్తిరాజు, తండ్రి: పల్లయ్యశెట్టి, వయస్సు 52 సం॥లు, హిందూ, వ్యవసాయం, పేరూరు, అమలాపురం మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. ...పిటీషనరు /వాది
అండ్
పెన్మెత్స వంశీ కృష్ణరాజు, తండ్రి: లేటు రామకృష్ణరాజు, వయస్సు 24 సం॥లు, హిందూ, మెడికల్ స్టూడెంట్, డో.నెం. 5-3-75, సుబ్బారాయుడి గుడి వద్ద, కాలేజీ రోడ్డు, అమలాపురం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. ...రెస్పాండెంటు /ప్రతివాది
పై నెంబరులోని పిటీషనర్ /వాది మీపై దాఖలు చేసిన దావా మొత్తము తదుపరి వడ్డీ మరియు ఖర్చులకు మిమ్ములను సెక్యూరిటీ ఇమ్మని, లేనిచో పిటీషను షెడ్యూలు దాఖలాస్థిని జప్తు చేయించమని కోరుచూ పిటీషనును దాఖలు చేసినందున, అందుపై శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసిననూ అమలు జరగనందున మీకు ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని ఉన్న ఎడల శ్రీకోర్టు వారి ఎదుట వాయిదా తేదీ అయిన **ది. 08-12-2022వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తెలియపర్చుకొనవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
అమలాపురం, **తిక్కా వెంకటప్రసాదరావు,**
30-11-22. వాది తరపు అడ్వకేట్,
అమలాపురం. సెల్: 94400 63075